క్లుప్తంగా

హెల్మెట్ తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న మూడో పట్టణ ట్రాఫిక్ పోలీసులు

బీచ్ రోడ్డు: ద్విచక్ర వాహనచోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని మూడో పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ ఈశ్వరరావు సూచించారు. సోమవారం సిరిపురం సర్కిల్‌లో హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరమని ఎస్ఐ హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలన్నారు. హెల్మెట్ ధరించని వాహనచోదకులకు చలానా విధించగా.. ధరించిన వారికి గులాబీ పూలు ఇచ్చి అభినందించారు.

యూనిఫారం పంపిణీ

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు తోటగరువులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈవో సీహెచ్.రవీంద్రబాబు సందర్శించారు. ఇక్కడ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, ఈ ఏడాది కొత్తగా చేరిన విద్యార్థులు, హాజరు తదితర విషయాలను పరిశీలించారు. అనంతరం ఆయన పాఠశాల ఉపాధ్యాయులతో కలసి ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. రోజూ తప్పకుండా బడికి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథం, సీఆర్‌పీ అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐజీ శ్రీకాంత్‌కు అభినందన

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం పూర్వ విద్యార్థి, సీనియర్ ఐపీఎస్ చిరువోలు శ్రీకాంత్‌కు ఆ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి అభినందనలు తెలిపారు. ఇటీవల శ్రీకాంత్ రాష్ట్ర పోలీసు శాఖ శాంతి భద్రతల విభాగం ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ మేరకు మంగళగిరిలో ఆయనను రవి కలిసి మొక్కను బహూకరించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఏయూని సందర్శించి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలని ఆచార్య రవి కోరారు.

ఘనంగా కనకమాంబ తొలేళ్ల ఉత్సవం



మద్దిలపాలెం: ఇసుకతోట రహదారి పక్కన ఉన్న శ్రీకనకమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి ఆలయ పూజారి వేకువ జామున ప్రత్యేక పూజలు చేశారు. విశేష అలంకరణ తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. మంగళవారం అమ్మవారి వార్షిక జాతర జరగనుంది.

బీజేపీలో చేరిక



గౌస్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రులు

బీచ్ రోడ్డు: చినవాల్తేరులోని మహ్మదీయ మసీదు అధ్యక్షుడు మహ్మద్ గౌస్ సోమవారం బీజేపీలో చేరారు. నగరానికి వచ్చిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. ప్రధాని మోదీ నాయకత్వంపై ఆకర్షితుడినై పార్టీలో చేరినట్టు గౌస్ తెలిపారు.

నిరుద్యోగ భృతి.. భ్రాంతియేనా!

- ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం లేదా భృతి ఇస్తామని ప్రకటించిన కూటమి
- యువతతో ఓట్లు వేయించుకుని గట్టెక్కిన చంద్రబాబు అండ్ కో
- ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటినా కానరాని ప్రకటన
- నియోజకవర్గంలో దాదాపు 40 వేల మంది నిరుద్యోగుల ఎదురుచూపులు
- 2014–19 సమయంలో నిరుద్యోగ భృతిపై నమ్మించి వంచించిన బాబు

2014 ఎన్నికల సమయంలో టీడీపీ-జనసేన-బీజేపీ కలిసి పోటీ చేశాయి. ఆ సమయంలో ప్రతి ఇంటికీ ఒక ఉద్యోగం ఇస్తామని ఊదరగొట్టారు. లేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. కానీ దాదాపు నాలుగున్నరేళ్లు గడిచిన తరువాత అర్హత ఉన్నవారిలో కనీసం 20 శాతం మందికి కూడా భృతి ఇవ్వకుండా దగా చేసింది.

2024 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి జతకట్టింది. మళ్లీ నిరుద్యోగ భృతి హామీని తెరపైకి తెచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. లేకపోతే తక్షణమే నిరుద్యోగులందరికీ రూ.3వేలు భృతి ఇస్తామని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. వారి మాటలు నమ్మిన నిరుద్యోగులు మరోసారి కూటమికి ఓట్లు వేశారు. కానీ అధికారం చేపట్టి నెల రోజులు దాటినా భృతిపై ఎలాంటి ప్రకటన రాలేదు.

తూర్పు నియోజకవర్గంలో సుమారు 1.20 లక్షలు ఇళ్లు ఉన్నాయి. దాదాపు ప్రతి ఇంట్లోనూ ఒకరిద్దరు నిరుద్యోగులు ఉన్నారు. నిరుద్యోగ భృతి హామీతో వారంతా కూటమి ప్రభుత్వంపై గంపెడాశలు పెట్టుకున్నారు. భృతి ఎప్పుడు ఇస్తారని ఎదురు చూస్తున్నారు. గతంలో వలే మోసం చేయొద్దంటూ హెచ్చరిస్తున్నారు.

– ఆరిలోవ/బీచ్‌రోడ్డు/ఎంవీపీ కాలనీ



యువతకు ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ భృతి చెల్లిస్తామని కూటమి నాయకులు ప్రకటించిన మేనిఫెస్టో

ఆశగా ఎదురు చూస్తున్నాం..



నేను డిప్లమో ఫార్మసీ పూర్తి చేశా. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇంట్లో నిరుద్యోగులకు ఉద్యోగం లేదా భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. దీనికి ఆశపడి ఓటు వేశాం. కూటమి అధికారంలో రాగానే ఉద్యోగం వస్తుందని ఆశపడ్డాం. కానీ టెట్ ప్రకటన మాత్రమే ఇచ్చింది. డీఎస్సీ నోటిఫికేషన్ ఈ ఏడాది వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మిగతా ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఎటువంటి ప్రకటనలు రాలేదు. ఉపాధి లభించేంత వరకు నిరుద్యోగ భృతి అందించాలి. దీనిపై తక్షణం ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నాం.

– ఇజ్జాడ దివాకర్, టీఐసీ పాయింట్, ఆరిలోవ

ఉద్యోగాల జాతరేదీ?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాల జాతర మొదలవుతుందని ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. కానీ ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదు. తక్షణమే ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలి. అప్పటి వరకు ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగ భృతి అందించాలి.

– అప్పలనాయుడు, నిరుద్యోగి, చినవాల్తేరు

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి



కూటమి పార్టీలు ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి. ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదు. తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటించి అప్పటి వరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– శైలజ, రామ్‌నగర్

ఉద్యోగం లేదా భృతి ఇవ్వాలి



ఎన్నికల హామీల్లో చంద్రబాబు ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పారు. ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదు. ఉద్యోగం ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. దాని కోసం కూడా ఎటువంటి ప్రకటన రాలేదు. కనీసం నిరుద్యోగ భృతి అయినా ఇస్తే ఉద్యోగం వచ్చేంత వరకు ఆసరా ఉంటుంది. తక్షణమే నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– నర్సింహారావు, నిరుద్యోగి, రామ్‌నగర్

ఈ నెల్లోనే డీఎస్సీ ప్రకటించాలి



డీఎస్సీపై సీఎం చంద్రబాబు తొలి సంతకం చేసి నెల రోజులు పైనే గడుస్తున్నా నోటిఫికేషన్ నేటికి విడుదల చేయలేదు. జులై నెలలోనే నోటిఫికేషన్ విడుదల చేసి చిత్తశుద్ధి చాటుకోవాలి. కుంటు సాకులు చూపుతూ టెట్ నిర్వహణకే మూడు నెలల సమయం తీసకుంటున్నారు. దీన్ని బట్టి డీఎస్సీ ఈ ఏడాది లేనట్టే. కనీసం నిరుద్యోగ భృతి అయినా ఇచ్చి మాట నిలబెట్టుకోవాలి. – సిర్లా శ్యామ్, విద్యార్థి నాయకుడు

తక్షణమే భృతి చెల్లించాలి..



అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగులు భర్తీ చేస్తామని, ఉద్యోగం వచ్చే వరకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ప్రతి నెలా చెల్లిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే ప్రచారం తప్ప ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల ఎక్కడా కానరావడం లేదు. కనీసం నిరుద్యోగ భృతికి సంబంధించి మార్గదర్శకాలైనా విడుదల చేయాలి. అర్హులైన ప్రతి నిరుద్యోగికి భృతి అందించి ఆదుకోవాలి. – శ్యామ్ సుందర్, నిరుద్యోగి

ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి చేరుకున్న మేయర్



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని అరికట్టవచ్చని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీకి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అక్కడి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌తో కలిసి ప్రజా పరిష్కార వేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను వినియోగించే నిర్ణయం మేరకు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ అనేక అవగాహన చర్యలు చేపడతుందన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.

16 మందికి ఏఐసీటీఈ ప్రగతి ఉపకార వేతనాలు



ప్రగతి ఉపకార వేతనాలు అందుకున్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు

మురళీనగర్: ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) ప్రగతి ఉపకార వేతనాలకు 2023–24 సంవత్సరానికి కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న 16 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ బ్రాంచి నుంచి బి.హర్షిణి, పి.లక్ష్మీప్రియ, ఎస్.శృతి, డి.భూపేశ్వరి, జి.దివ్యశ్రీ, ఎం.స్నేహ, కె.శ్రీయ, టి.మౌనిక మహాలక్ష్మి, ఎం.అలేఖ్య, పి.మౌళిక, ఎన్.కుషి, పి.అపురూప, ఎం.దిల్‌షాద్, ఎస్.ఆసీఫా సుల్తాన్, మెకానికల్ ఇంజినీరింగ్ బ్రాంచి నుంచి వి.హాసిని, ఎస్.ఉజ్వల ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఒక్కొక్కరికి ఏడాదికి రూ.50,000 చొప్పున ఉపకార వేతనం ఏఐసీటీఈ మంజూరు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా సోమవారం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన బాలికలను ప్రిన్సిపాల్ నారాయణరావు, ఎలక్ట్రికల్ హెడ్ కేడీవీ నరసింహారావు, మెకానికల్ హెడ్ కె.మధుకుమార్ అభినందించారు.

సర్క్యులర్ 1/2019ను అమలు చేయాలి



ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఉద్యోగులు

మద్దిలపాలెం: ప్రభుత్వం జారీ చేసిన 1/2019 సర్క్యులర్‌ను తక్షణమే అమలు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు కోరారు. రాష్ట్రంలో అతిపెద్ద యూనియన్‌గా ఎన్ఎంయూఏ ఆవిర్భవించిందన్నారు. సోమవారం ఆయన యూనియన్ కార్యాలయంలో కార్మికుల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఏపీపీటీడీ ఉద్యోగులు, కార్మికులు ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని కేటగిరీల పదోన్నతులకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పి.వి.వి. మోహన్, నాయకులు పి.పి.ఎం.రాజు, జి.రామారావు, వి.అప్పారావు, జోనల్ కార్యదర్శి ఎం.వి.ఆర్. మూర్తి, వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాల సంక్షేమానికి కృషి

- సీపీ శంఖబ్రత బాగ్చీ
- కరాసా పోలీస్ క్వార్టర్స్ సందర్శన



పోలీసు కుటుంబాలతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ సీపీ ఫకీరప్ప

గోపాలపట్నం: పోలీస్ కుటుంబాల సంక్షేమానికి కృషి చేస్తానని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. కరాసా పోలీస్ క్వార్టర్స్‌ను సోమవారం ఆయన జాయింట్ సీపీ ఫకీరప్పతో కలిసి సందర్శించారు. స్థానికంగా ఉన్న పోలీసు కుటుంబ సభ్యులు ఇక్కడి సమస్యలపై ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయడంతో క్షేత్ర స్థాయిలో పరిశీలించేదకు ఆయన వచ్చారు. ఇక్కడి గృహ సముదాయాలను పరిశీలించారు. పోలీస్ కుటుంబాలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీ సక్రమంగా లేక వర్షాకాలంలో నీరు నిల్వ ఉండిపోయి వల్ల దోమల బెడద ఉందని ఆయన ముందు వాపోయారు. చాలా ఇళ్లకు తలుపులు, కిటికీలు లేవని తెలిపారు.గచ్చులు మరమ్మతులకు గురయ్యాయని, వీధి దీపాలు లేవని వివరించారు. ఈ సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పోలీస్ కుటుంబాలకు ఏ సమస్య వచ్చినా 7995095799 నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు.

బర్మా కాందిశీకుల సమస్యలు పరిష్కరించాలి

కంచరపాలెం: భూకబ్జాదారుల నుంచి ఆంధ్ర, బర్మా కాందిశీకులకు ప్రభుత్వం అందించిన భూములను కాపాడాలని కాందిశీకుల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి గుసుపూడి అరుణ్‌బాబు కోరారు. సోమవారం విశాఖకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను సర్క్యూట్ హౌస్‌లో కలిసి వినతి పత్రం అందించారు. బర్మా కాందిశీకుల సమస్యలను వినతిపత్రంలో పేర్కొన్నారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే పరిష్కరించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు అరుణ్‌బాబు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణారావు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎస్‌బీఐ, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత సదస్సు జరిగింది. ఈ సదస్సును కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణారావు ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎన్‌జీవో ప్రతినిధి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి బి. సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన విమ్స్ డైరెక్టర్



సత్యకుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు

ఆరిలోవ: నగరానికి వచ్చిన రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సోమవారం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. విమ్స్ ప్రస్తుతం పరిస్థితి, అందుబాటులో ఉన్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది సంఖ్య, మరింత అభివృద్ధికి అవసరమైన సదుపాయాల ఏర్పాటు, జీవన్‌దాన్‌లో అవయదానం తదితర వాటి గురించి మంత్రికి వివరించారు. అవయవాల దానం ప్రక్రియను మరింత విస్తృతం చేయాలని డైరెక్టర్ డాక్టర్ రాంబాబుకు మంత్రి సూచించారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: పెయిరింగ్ రైళ్ల ఆలస్యంగా నడుస్తున్నందున ఆయా స్టేషన్‌ల నుంచి సోమవారం రైళ్లు ఆలస్యంగా బయల్దేరినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి 10.50గంటలకు హౌరాలో బయల్దేరాల్సిన హౌరా– ఎస్ఎంవీ బెంగళూరు (12863) ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా మధ్యరాత్రి 12.50గంటలకు బయల్దేరింది. సోమవారం సాయంత్రం 6 గంటలకు సంత్రగచ్చిలో బయల్దేరాల్సిన సంత్రగచ్చి– తాంబరం(22841) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ సుమారు 26 గంటలు ఆలస్యంగా మంగళవారం రాత్రి 8 గంటలకు బయల్దేరుతుంది. సోమవారం రాత్రి 11.15గంటలకు షాలిమర్‌లో బయల్దేరవలసిన షాలిమర్ – వాస్కోడగామా (18047) అమరావతి ఎక్స్‌ప్రెస్ సుమారు 6గంటలు ఆలస్యంగా మంగళవారం తెల్లవారు 5.30గంటలకు బయల్దేరింది.

ధ్రువపత్రాల కోసం అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీరామమూర్తి

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అర్జీదారులు వినతులు అందజేశారు. తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జి.శ్రీరామమూర్తి వాటిని స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులతో పాటు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహ సీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ, ఇబ్రహీం, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుతో ఉపాధి అవకాశాలు



శిక్షణ పొందిన వారితో పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణరావు

మురళీనగర్: చదువులో రాణించడంతోపాటు నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటే ఉపాధి అవకాశాలు వస్తాయని కంచరంచపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అన్నారు. కాలేజీలోని స్కిల్ హబ్‌లో సోమవారం ప్రపంచ నైపుణ్యాభివృద్ధి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వారిలోని సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీసేందుకు తమ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాలేజీ ప్రాంగణంలోని స్కిల్ హబ్ ద్వారా ఉపాధి అవకాశాలు పెంచేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కుట్టుమిషన్ ఆపరేటింగ్, ఎలక్ట్రికల్ శిక్షణ పొందిన 19 మందికి సర్టిఫికెట్లను నారాయణరావు అందించారు. కార్యక్రమంలో కాలేజీ ఎలక్ట్రికల్ విభాగం హెడ్ కేడీవీ నరసింహారావు, స్కిల్ హబ్ ట్రైనర్ సుబ్రమణ్యేశ్వరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ డీఎస్‌డీవో సాయికృష్ణ చైతన్య, స్కిల్ హబ్ ఇన్‌చార్జి టి.లక్ష్మి పాల్గొన్నారు.

9 కిలోల గంజాయి స్వాధీనం



రైల్వేస్టేషన్‌లో అదుపులోకి తీసుకున్న గంజాయి నిందితులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలియజేసిన వివరాలు... రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై సోమవారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. బెంగళూరుకు చెందిన ఎండీ ఉస్మాన్‌భాషా, అబ్రార్ ఉల్హక్‌ల లగేజీలను తనిఖీ చేయగా సుమారు రూ.45వేలు విలువైన 9 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు అరకు నుంచి విశాఖ స్టేషన్ మీదుగా గంజాయిని బెంగళూరుకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని జీఆర్పీ సిబ్బంది తెలిపారు. గంజాయి సీజ్ చేసి, నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ అధికారులు తెలిపారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



జీవీఎంసీ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: ఆటో డ్రైవర్ల ఉపాధికి గండి కొట్టే ఓలా, ఉబర్, ర్యాపిడో సర్వీసులను రద్దు చేయాలని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు కాక ముందే ఆటోలపై ఆర్‌టీఏ, పోలీసులు పెడుతున్న అక్రమ కేసులు ఎత్తివేయాలని విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రెహమాన్, సీహెచ్ కాసుబాబు మాట్లాడుతూ విశాఖ జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఆటో స్టాండ్‌లు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నామన్నారు. వోలా, ఉబర్, ర్యాపిడో సర్వీసులు ఏర్పాటు చేసినప్పటి నుంచి తమ ఆదాయానికి గండి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఆర్‌టీఏ, పోలీసులు ఆటోలపై కేసులు పెడుతూ అధిక జరిమానాలు విధిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని వెంటనే ఇటువంటి చర్యలకు స్వస్తి పలికాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే అచ్యుతరావు, అధ్యక్షుడు మన్మథరావు, పోల్‌రెడ్డి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.